# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

❖ అమరావతిలో మౌలిక వసతుల అభివృద్ధి పనులు రెండేళ్లలో పూర్తి చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు.

❖ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

❖ పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ అమెరికాలో వివిధ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు.

❖ భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి టీ-20 క్రికెట్ మ్యాచ్ ఈ రోజు కటక్ లోని బారాబతి స్టేడియం వేదికగా జరగనుంది.

======================

జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తం అయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెవెన్యూ శాఖపై అమరావతిలో ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పాస్ పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని ఇప్పటికే ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. భూ వివాద రహిత ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ప్రతీ బుధవారం కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో 11 ఔషధ నియంత్రణ పరిపాలన కార్యాలయాలను దృశ్య మాధ్యమ విధానం ద్వారా ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో 11 కోట్ల రూపాయలతో ఔషధ నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకుల కార్యాలయాల భవనాలు నిర్మించామని వెల్లడించారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ను నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు. దేశంలో సుపరిపాలనకు అటల్ బిహారీ వాజ్‌పేయీ నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాదిని వేశాయని తెలిపారు. ‘‘అటల్ సందేశ్ - మోదీ సుపరిపాలన’’ యాత్ర వాజ్ పేయీ స్ఫూర్తి యువతలో నింపుతుందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ అమెరికాలో వివిధ సంస్థల ప్రతినిధులతో భేటీలు నిర్వహించారు. ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మతో సమావేశమయ్యారు. అమరావతిలో డిజైన్ & ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో డెస్క్ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్‌తోనూ భేటీ అయ్యారు. రాష్ట్రంలో యూఎస్ పెట్టుబడులకు సహకారం అందించాలన్నారు. శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డితో సమావేశమై.. ఆంధ్రప్రదేశ్‌లో డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరితోనూ మంత్రి సమావేశమయ్యారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌తో సమావేశమై.. అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

=====================

జాతీయ హస్తకళల అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు న్యూఢిల్లీలో ప్రదానం చేశారు. 2023 సంవత్సరానికి గానూ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డి. శివమ్మకు తోలు బొమ్మల విభాగంలో జాతీయ అవార్డు లభించింది. 2023 సంవత్సరానికి జాతీయ అవార్డును రాతి చెక్కడాలు విభాగంలో బ్రహ్మానంద మహారాణ, 2024 సంవత్సరానికి జాతీయ అవార్డును బొమ్మల విభాగంలో గోరస సంతోష్ కుమార్ అందుకున్నారు.

విరామం

=====================

రాజధాని అమరావతిలో చేపట్టిన ప్రధాన మౌలిక వసతుల పనులు శర వేగంతో సాగుతున్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులను మంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతుల పనులు త్వరితగతి జరుగుతున్నాయని అన్నారు. డ్రైనేజీలు, రోడ్లు, ఇతర సౌకర్యాలు రాబోయే రెండు సంవత్సరాలలో పూర్తి అవుతాయని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

=====================

స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని 10 ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలను CGST ఆడిట్ కమిషనర్ పి. ఆనంద్ కుమార్ ఈ రోజు ప్రారంభించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పది అభివృద్ధి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. తాగునీరు అందుబాటులో ఉండడం ద్వారా విద్యార్థుల్లో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించవచ్చని అన్నారు.

=====================

గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్‌లో ఉంచిన 5 లక్షల 74 వేల 908 ఎకరాల అసైన్డ్ భూముల వివరాల పునః పరిశీలన చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. 2 కోట్ల 77 లక్షల కుల ధృవీకరణ పత్రాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నామని, ఈ ఆర్థిక సంవత్సరం స్టాంప్, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా 10 వేల 169 కోట్ల రూపాయల ఆదాయం ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

=====================

‘తిరుపతి - సాయి నగర్ షిర్డీ’ నూతన రైలును దృశ్యమాధ్యమం ద్వారా ఢిల్లీ నుంచి కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న ఈరోజు ప్రారంభించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ లో జెండా ఊపి రైలును లాంఛనంగా ప్రారంభించారు.

=====================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో రాగల ఐదు ఏళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ తోటలు పెంచేందుకు 222 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం. నాయక్ తెలిపారు. ఈ రోజు జిల్లాలో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ… జిల్లాలో తొలి ఆదివాసీల మ్యూజియం నిర్మాణం వచ్చే సంవత్సరం జనవరి 15 నాటికి పూర్తి చేస్తామన్నారు.

=====================

భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 క్రికెట్ సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ ఈ రోజు కటక్ లోని బారాబతి స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. టెస్టు సిరీస్‌లో పరాజయం పొందిన భారత్… ఆ తర్వాత జరిగిన వన్డే సిరీస్‌లో విజయం సాధించింది.

=====================

గోదావరి డెల్టా ముంపు, నీటి పారుదల సమస్యలపై రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అమరావతిలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ… గోదావరి డెల్టా లైడార్ సర్వే కోసం 13.4 కోట్ల రూపాయలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ కు కొత్త గేట్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం 150 కోట్ల రూపాయల నిధులు కేటాయించిందని తెలిపారు.

=====================

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని ఆ సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాదాల కేసులు, ప్రీ లిటిగేషన్, బ్యాంక్, చిట్ ఫండ్ కేసులు ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించకోవచ్చని అన్నారు. ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ సికిందర్ భాషా సూచించారు.

=====================
=====================